
ఆంధ్రజ్యోతి
గరిష్ఠం 37.0
కనిష్ఠం 25.0
ANDHRAJYOTHY
సూర్యాపేట
5
శుక్రవారం 21 జూన్ 2024



ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	504.40 (122.3596)	నిల్	800
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	637.60 (2.69)	197	78.39
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	94.29 (0.38)	నిల్	నిల్

చికెన్ ధరలు | లైవ్ : రూ.160 | డ్రెస్ : రూ.230 | స్కిన్‌లెస్ : రూ.250

మద్దతు తక్కువే



- పంటల మద్దతు ధరలను ప్రకటించిన కేంద్రం
- గత ఏడాదితో పోల్చితే పెంపు తక్కువే
- వరికి రూ.117, పత్తికి రూ.501
- కందికి రూ.550, నువ్వులకు రూ.632 పెంపు

మోత్కూరు, జూన్ 20: కేంద్ర ప్రభుత్వం పంటలకు మద్దతు ధర ప్రకటించింది. ఏటా సాగు ఖర్చు పెరుగుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ మద్దతు ధర పెంపు గత ఏడాదితో పోల్చితే ఈ సారి తగ్గింది. సాగు వ్యయం మాత్రం గత ఏడాదితో పోల్చితే పెరిగింది. గత ఏడాది వరికి రూ.143, పత్తికి రూ.540, కందికి రూ.400, నువ్వులకు రూ.805, పెసర రూ.803పై మద్దతు ధర పెంచగా, ఈ ఏడాది వరికి రూ.117, పత్తికి రూ.501, కందికి రూ.550, నువ్వులకు రూ.632, పెసరకు రూ.124 మాత్రమే పెంచారు. గత ఏడాది కంటే ఈ సారి కంది, రాగులు, పొద్దుతిరుగుడుకు కొంత ఎక్కువగా పెరిగింది. సన్న రకాల వరి ధాన్యానికి మాత్రం కేంద్రం మద్దతు ధర ప్రకటించలేదు.

ఎక్కువ సాగయ్యే పంటలపై తక్కువ

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో వరి, పత్తి అధికంగా సాగవుతోంది. కంది, వేరుశనగ, తదితర పంటలు చాలా తక్కువ విస్తీర్ణంలో సాగవుతాయి. నువ్వులు, పెసర, పొద్దుతిరుగుడు, మినుములు లాంటి పంటలు నామమాత్రంగా సాగవుతాయి. ఎక్కువగా సాగు చేసే పంటలకు మద్దతు ధర తక్కువగా పెంచి, నామమాత్రంగా సాగయ్యే పంటలకు కొంత ఎక్కువగా పెంచడంతో పెద్దగా లాభం ఉండదని రైతులు పేర్కొంటున్నారు.

పెరిగిన సాగు వ్యయం

గత ఏడాదితో పోల్చితే ఈ ఏడాది సాగు వ్యయం బాగా పెరిగింది. విత్తనాలు, ట్రాక్టర్ దున్నకం, ఫ్లో, కూలీల రేట్లు బాగా పెరిగాయి. వ్యవసాయ పంపుసెట్లు, ట్రాక్టర్ లాంటి వ్యవసాయ యంత్రాల ధరలు ఇబ్బడిముబ్బడిగా పెరిగాయి. ఇలా సాగు ఖర్చు పెరగడంతో కేంద్ర ప్రభుత్వం పెంచే మద్దతు ధరలు పెట్టుబడి ఖర్చుల పెరుగదలతో సరిపోలడం లేదని రైతులు పేర్కొంటున్నారు.

సాగు వ్యయాన్ని తక్కువగా చూపుతున్న ప్రభుత్వం

కేంద్ర ప్రభుత్వం ఏటా పంటల మద్దతు ధరలు పెంచుతున్నా, పంటల సాగు వ్యయం అంతకంటే ఎక్కువ పెరుగుతోంది. పంట సాగు వ్యయానికి 50శాతం అదనంగా కలిపి మద్దతు ధర ప్రకటించాలని గతంలో స్వామినాథన్ కమిషన్ కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేసింది. కాగా, కేంద్రం ప్రభుత్వం వాస్తవ వ్యయాన్ని పరిగణనలోకి తీసుకోకుండా సాగు ఖర్చును తక్కువగా చూపి దానికి 50శాతం కలిపి మద్దతు ధర ప్రకటిస్తోందని పలువురు నిపుణులు విమర్శిస్తున్నారు.

గిట్టుబాటు కాని మద్దతు ధరలు

పత్తి సాగుకు ఎకరాకు సుమారు రూ.45వేల ఖర్చు వస్తోంది. ఎకరాకు ఆరు నుంచి ఏడు క్వింటాళ్ల పత్తి కంటే ఎక్కువ దిగుబడి రావడం లేదు. ఎకరాకు ఏడు క్వింటాళ్ల పత్తి దిగుబడిని తీసుకుంటే క్వింటాకు రూ.7,521 చొప్పున రూ.52,647 వస్తాయి. అందులోంచి రూ.45వేలు పెట్టుబడి తీయగా రైతుకు మిగిలేది రూ.7,647. పత్తి ట్రాన్స్‌పోర్ట్‌కు క్వింటాలకు రూ.500 ఖర్చు వస్తోంది. సొంతంగా సాగు చేసుకునే రైతు అయితేనే ఈ మిగులుబాటు. అదే కౌలు రైతు అయితే అది కూడా మిగలదు. వరి సాగుకు ఎకరాకు సుమారు రూ.27వేలు ఖర్చవుతుంది. ఎకరాకు సగటున 23 క్వింటాళ్ల ధాన్యం దిగుబడి వస్తుంది. ప్రభుత్వానికి విక్రయించాలంటే మార్కెట్‌కు తరలించి ఆరబెట్టి, తూర్పార పడితే సుమారు మూడు క్వింటాళ్ల తరుగు వస్తుంది. ఇక 20 క్వింటాళ్లకు రూ.46,000 వస్తాయి. అంటే ఎకరాకు రూ.9వేలు మిగులుతాయి. అది కూడా సొంతంగా సాగుచేస్తేనే. ఎకరాకు రూ.10వేలు కౌలు ఉంది. ప్రైవేట్ వ్యాపారులు క్వింటాకు రూ.1,900 చెల్లిస్తున్నారు. దీంతో రైతుకు మిగులుబాటు ఉండటం లేదు.

పంటల మద్దతు మద్దతు ధర పెంపు ఇలా...

పంటరకం	2022లో	2023లో	పెంపు	2024లో	పెంపు
వరి (సాధారణం)	రూ.2,040	రూ.2,183	రూ.143	రూ.2,300	రూ.117
వరి (ఏ-గ్రేడ్)	రూ.2,060	రూ.2,203	రూ.143	రూ.2,320	రూ.117
పత్తి (మధ్యస్థ పింజ)	రూ.6,080	రూ.6,620	రూ.540	రూ.7,121	రూ.501
పత్తి (పొడువు పింజ)	రూ.6,380	రూ.7,020	రూ.640	రూ.7,521	రూ.501
కంది	రూ.6,600	రూ.7,000	రూ.400	రూ.7,550	రూ.550
పెసర	రూ.7,755	రూ.8,558	రూ.803	రూ.8,682	రూ.124
మినుములు	రూ.6,600	రూ.6,950	రూ.350	రూ.7,400	రూ.450
జొన్న (హైబ్రీడ్)	రూ.2,970	రూ.3,180	రూ.210	రూ.3,371	రూ.191
జొన్న (మాల్డండి)	రూ.2,990	రూ.3,225	రూ.235	రూ.3,421	రూ.196
సజ్జ	రూ.2,350	రూ.2,500	రూ.150	రూ.2,625	రూ.125
రాగులు	రూ.3,578	రూ.3,846	రూ.268	రూ.4,290	రూ.444
మొక్కజొన్న	రూ.1,962	రూ.2,090	రూ.128	రూ.2,225	రూ.135
వేరుశనగ	రూ.5,850	రూ.6,377	రూ.527	రూ.6,783	రూ.406
పొద్దుతిరుగుడు	రూ.6,400	రూ.6,760	రూ.360	రూ.7,280	రూ.520
సోయాబీన్	రూ.4,300	రూ.4,600	రూ.300	రూ.4,892	రూ.292
నువ్వులు	రూ.7,830	రూ.8,635	రూ.805	రూ.9,267	రూ.632

వరి, పత్తికి ఇంకా పెంచాలి



కేంద్ర ప్రభుత్వం పంటల మద్దతు ధర కొంత పెంచినా, అది గిట్టుబాటు కాదు. ఏటా సాగు ఖర్చులు పెరుగుతున్న తీరున ప్రభుత్వం మద్దతు ధర పెంచడం లేదు. వరికి క్వింటాకు కనీసం రూ.2600, పత్తికి రూ.9000 మద్దతు ధరగా నిర్ణయించాలి. అప్పుడే రైతుకు గిట్టుబాటు అవుతుంది. పంటల మద్దతు ధర ప్రకటించే ముందు ప్రభుత్వాలు రైతులతో గానీ, రైతు సంఘాల ప్రతినిధులతో గానీ చర్చించాలి.

● మర్రి మధు, రైతు, మోత్కూరు



భువనగిరిలో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

ఎరువులపై నిఘా

- ప్రత్యేక బృందాల ముమ్మర తనిఖీలు
- రూ.22లక్షల విలువైన వరి విత్తనాలు విక్రయించకూడదని నోటీసులు

యాదాద్రి, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): వానాకాలం పంటల సాగు ముమ్మరమైంది. రైతులు ఇప్పటికే దుక్కులు, వరి నారుమడులు సిద్ధం చేసుకోగా, పలు ప్రాంతాల్లో పత్తితో పాటు ఆరుతడి పంటల విత్తనాలు విత్తారు. భారీ వర్షాలు కురవగానే ముమ్మరంగా విత్తనాలు విత్తేందుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో వానాకాలం సీజన్‌కు సంబంధించిన విత్తనాలు, ఎరువుల విక్రయాలపై జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది. మరో వారం రోజుల్లో ఎరువుల విక్రయాలు ఊపందుకోనున్నాయి.

రైతులకు ఎరువులు ఎమ్మార్పీకే విక్రయించేందుకు వ్యవసాయశాఖ చర్యలు తీసుకుంది. జిల్లావ్యాప్తంగా ఎరువుల విక్రయాలపై నిఘా ఏర్పాటు చేసింది. ఎరువులు అధిక ధరలకు విక్రయించిన డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగా అధికారులతో ప్రత్యేక తనిఖీ బృందాలు ఏర్పాటు చేసింది. ఈ బృందాలు జిల్లావ్యాప్తంగా ఎరువుల ధరలను తనిఖీచేసి ఎమ్మార్పీకే రైతులకు విత్తనాలు, ఎరువులు విక్రయించేలా చర్యలు తీసుకుంటున్నాయి. అదేవిధంగా జిల్లాలో రాష్ట్రస్థాయి తనిఖీ బృందాలు(స్క్వాడ్) కూడా తనిఖీలు నిర్వహిస్తున్నాయి. ఈ బృందంలో వ్యవసాయ, రెవెన్యూ, పోలీసు శాఖ అధికారులు ఉన్నారు. జిల్లాలో ఇప్పటివరకు రూ.22లక్షల విలువైన వరి విత్తనాలను విక్రయించకూడదని వ్యవసాయశాఖ అధికారులు డీలర్లకు నోటీసులు జారీచేశారు. ఇప్పటివరకు 220 అవుట్‌లెట్స్‌కు 188 దుకాణాల్లో తనిఖీలు జరిగాయి. డీలర్ల వద్ద ఉన్న పాత స్టాక్ వివరాలు సేకరించడంతోపాటు, పాత ధరకే రైతులకు విక్రయించాలని ఆదేశాలు జారీ చేశారు. గత ఏడాది డీలర్ల వద్ద మిగిలిన ఎరువులను కొత్త ధరలకు విక్రయించవద్దని స్పష్టం చేశారు. జిల్లాలో మొత్తం తొమ్మిది బృందాలు తనిఖీలు నిర్వహిస్తున్నాయి. అదేవిధంగా కృత్రిమ ఎరువుల కొరతను సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వ్యవసాయశాఖ అధికారులు ఇప్పటికే హెచ్చరికలు జారీ చేశారు. డీలర్ల వద్ద స్టాక్ ఉన్నంత వరకు ఎరువులను విక్రయించాలని, లేనిపక్షంలో కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. లైసెన్స్ ఉన్న దుకాణాల్లోనే విత్తనాలు, ఎరువులను కొనుగోలుచేయాలని వ్యవసాయశాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

అందుబాటులో ఎరువులు

యాదాద్రి జిల్లాలో 4.28లక్షల ఎకరాల్లో పంటలు సాగవుతాయని అంచనా. 1.35లక్షల ఎకరాల్లో పత్తి, 2.85లక్షల ఎకరాల్లో వరి, ఇతర పప్పుధాన్యాలు, నూనెగింజలు సాగవనున్నాయి. ప్రస్తుత సీజన్‌లో 80,594 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం. ప్రస్తుతం డీఏపీ, కాంప్లెక్స్ ఎరువుల వాడకం అధికంగా ఉంటుంది. ఆగస్టులో యూరియాతో పాటు మరికొన్ని కాంప్లెక్స్ ఎరువులను రైతులు వినియోగిస్తారు. జిల్లాలో యూరియా 35,260మెట్రిక్ టన్నులు, డీఏపీ 14,530, ఎంవోపీ 5,812, కాంప్లెక్స్ 23,248, ఎస్ఎస్‌పీ 1,744 మెట్రిక్ టన్నులు అవసరం. కాగా, యూరియా 13,181 మెట్రిక్ టన్నులు, డీఏపీ 511.29, ఎంవోపీ 361.40, కాంప్లెక్స్ 177.60, ఎస్ఎస్‌పీ 3048.22 మెట్రిక్ టన్నుల వరకు అందుబాటులో ఉన్నాయి. అదేవిధంగా పత్తి విత్తనాలు 2,70,000 ప్యాకెట్లు, వరి 71,012, పప్పు ధాన్యాలు 208, నూనెగింజలు 63.48 టన్నుల వరకు అవసరం. ఈ మేరకు విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచనున్నారు.

అందుబాటులో ఎరువులు, విత్తనాలు



వానాకాలంలో రైతులు 4.28లక్షల ఎకరాలు వరకు సాగుచేయనున్నట్లు అంచనా వేశాం. విత్తనాలు, ఎరువులు రైతులకు ఎమ్మార్పీకే విక్రయించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. అందుకు ప్రత్యేక తనిఖీ బృందాలను ఏర్పాటుచేశాం. అన్ని దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి స్టాక్ వివరాలు సేకరిస్తున్నారు. రైతులకు సరిపడా ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. ఏ మాత్రం ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఎఫ్‌సీవో 85 చట్టం ప్రకారం కల్తీ విత్తనాలు విక్రయించవద్దని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కృత్రిమ ఎరువులు, విత్తనాల కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

● కె.అనురాధ, జిల్లా వ్యవసాయాధికారి

అంగన్‌వాడీ టీచర్ల సేవలు అభినందనీయం

● కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్




సమవేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

సూర్యాపేట(కలెక్టరేట్), జూన్ 20: అంగన్‌వాడీ టీచర్ల సేవలు అభినందనీయమని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లాలోని 70మంది అంగన్‌వాడీ టీచర్లకు నూతన పూర్వ ప్రాథమిక విద్యపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. పిల్లలకు పౌష్టికాహారం అందించడంతోపాటు చదువుపై మక్కువ పెరిగేలా చూడాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సీహెచ్ ప్రియాంక, బీఎస్ లత, జిల్లా సంక్షేమ అధికారి జ్యోతిపద్మ, సీడీపీవోలు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా కృషి చేయాలి

జిల్లాలో ప్రభుత్వ పథకాల అమలులో రాజీపడకుండా అర్హులైన ప్రతీ ఒక్కరికి అందేలా అధికారులు కృషి చేయాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. కలెక్టరేట్‌లో జరిగిన జిల్లా స్థాయి అధికారులతో జరిగిన సమావేశంలో అదనపు కలెక్టర్లు సీహెచ్. ప్రియాంక, బీఎ్‌స.లతతో కలిసి మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనల మేరకు పక్కా ప్రణాళికతతో పారదర్శకంగా పథకాలు అమలు చేయాలన్నారు. ప్రతీ పనిలో ప్రజల భాగస్వామ్యం ఉండాలన్నారు. మిషన్ భగీరథ సర్వేను వేగవంతం చేయాలని సూచించారు. సమావేశంలో జడ్పీ సీఈవో అప్పారావు, డీఎఫ్‌వో సతీష్‌కుమార్, డీపీవో సురేష్‌కుమార్, డీఈవో అశోక్, డీబ్ల్యూవో జ్యోతి పద్మ, సీపీవో కిషన్, డీటీడీవో శంకర్, డీవైసీఈవో శిరీష పాల్గొన్నారు.

నూతన చట్టాలపై అవగాహన అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న నాగేశ్వర్‌రావు

సూర్యాపేటక్రైం, జూన్ 20: ప్రతీ ఒక్కరు నూతన చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని అదనపు ఎస్పీ నాగేశ్వర్‌రావు అన్నారు. గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నూతన చట్టాలపై కొనసాగుతున్న పోలీస్ శిక్షణా శిబిరంలో పాల్గొని మాట్లాడారు. చట్టాలపై పూర్తి అవగాహన ఉంటేనే వాటి అమలు సాధ్యమన్నారు. కోర్టుల్లో సైతం కేసులను గెలవచ్చునని అన్నారు. నేరస్థులకు శిక్షలు పడేలా చూడాలన్నారు. ప్రతీ ఒక్కరు శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

● వ్యవసాయ పనులు షురూ



చేనును దున్నతున్న రైతు, పక్కనే విత్తనాలు విత్తుతున్న మహిళా కూలీలు

ఇటీవల కురిసిన వర్షాలకు రైతులు వ్యవసాయ పనులను ముమ్మరం చేశారు. ఇప్పటికే అరక దున్ని విత్తనాలు నాటే పనుల్లో నిమగ్నమయ్యారు. మేళ్లచెర్వు మండలంలో ఇప్పటికే 70 శాతం విత్తనాలు నాటే పనులు పూర్తయ్యాయి.

● మేళ్లచెర్వు

అవాకులు పేలితే ప్రజలు తరిమికొడతారు

● జ్యుడిషియల్ కమిషన్‌పై కేసీఆర్ మాటలు విడ్డూరం ● బీఆర్ఎస్ ప్రజలు ఎప్పుడో విస్మరించారు ● అందుకే ఎంపీ ఎన్నికల్లో ఒక్కసీటు రాలేదు ● ఎంపీ రఘువీర్‌రెడ్డి, మాజీ మంత్రి ఆర్డీఆర్

సూర్యాపేటటౌన్, జూన్ 20: కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ నాయకులు అవాకులు, చవాకులు పేలితే ప్రజలు తరిమికొట్టడం ఖాయమని పార్లమెంట్ సభ్యుడు కుందూరు రఘువీర్‌రెడ్డి, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి అన్నారు. గురువారం జిల్లాకేంద్రంలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. విద్యుత్ కొనుగోలుపై జ్యుడిషియల్ కమిషన్ వేస్తే కమిషన్‌ను తప్పుబడుతూ మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. విద్యుత్ కొనుగోలు అవినీతిపై తమ దగ్గర ఆధారాలున్నాయని, బీఆర్ఎస్ నాయకులు మాట్లాడే ముందు ఆధారాలు, గణాంకాలతో వచ్చే దమ్ముందా? అని ప్రశ్నించారు. ఎన్నికలు ముగిశాయని, ప్రజాసమస్యలపైనే దృష్టి పెట్టి ప్రజాపాలన అందిస్తామన్నారు. అవాస్తవాలు, అబద్ధాలు చెప్పే బీఆర్ఎస్‌ను ప్రజలు ఎప్పుడో విస్మరించారని, దానికి ఉదాహరణే ఇటీవల పార్లమెంట్‌లో బీఆర్ఎస్‌కు ఒక్క సీటు దక్కకపోవడమన్నారు. సూర్యాపేట నియోజకవర్గం నుంచి సుమారు 70వేల ఓట్ల మెజార్టీతో పార్లమెంట్ ఎన్నికల్లో తనను గెలిపించినందుకు ప్రతీ ఒక్కరికి రుణపడి ఉంటానని, త్వరలో సమస్యల పరిష్కారంలో ముందుంటానన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు చెవిటి వెంకన్న యాదవ్, ఏఐసీసీ సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తంరెడ్డి, నాయకులు కొప్పుల వేణారెడ్డి, చకిలం రాజేశ్వర్‌రావు, అంజద్‌అలీ, కక్కిరేణి శ్రీనివాస్, అబ్దుల్ రహీం, చింతమల్ల రమేష్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, చిత్రంలో రాంరెడ్డి సర్వోత్తంరెడ్డి

మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జానారెడ్డి పుట్టిన రోజు వేడుకలు

జిల్లా కేంద్రంలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో పౌరసరఫరాలు, భారీ నీటి పారుదల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన పార్లమెంట్ సభ్యుడు కుందూరు రఘువీర్‌రెడ్డి, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డితో కలిసి కేక్‌కట్‌చేసి శుభాకాంక్షలు తెలిపారు.

సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలి

● సీపీఎం రాష్ట్రకార్యదర్శి వర్గ సభ్యుడు నాయకుడు ఎస్.వీరయ్య



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్.వీరయ్య

పెన్‌పహాడ్, జూన్ 20: నీట్ ప్రశ్న పత్రం లీకేజీ కుంభకోణంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని సీపీఎం రాష్ట్రకార్యదర్శి వర్గ సభ్యుడు ఎస్.వీరయ్య అన్నారు. గురువారం పెన్‌పహాడ్ మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహిస్తున్న సీపీఎం సూర్యాపేట జిల్లాస్థాయి రాజకీయ శిక్షణ తరగతుల ముగింపులో ఆయన మాట్లాడారు. పేపర్ లీకేజీలో బీజేపీ నాయకుల హస్తం ఉందన్నారు. నీట్ పరీక్ష పేపర్ లీకేజీ మూలంగా 24లక్షల కుటుంబాలు తీవ్ర ఆవేదనతో ఉన్నాయన్నారు. పిల్లల భవిష్యత్ ఏమిటని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. లక్షల రూపాయలు ఖర్చు చేసి, కోచింగ్ తీసుకొని పరీక్షలు రాస్తే చివరి నిమిషంలో పేపర్ లీకేజీ కుంభకోణాలు జరిగి విద్యార్థుల భవిష్యత్‌ను అంధకారం చేయడం దుర్మార్గపు చర్య అన్నారు. బీహార్, గుజరాత్, హర్యానా రాష్ట్రాల్లో కూడా నీట్ ప్రశ్న పత్రాలు లీకైనట్లు ఆరోపణలు ఉన్నాయన్నారు. పేపర్ లీకేజీ అవకతవకలపై ఇంత వరకు ప్రధాని మోదీ, కేంద్ర విద్యాశాఖ మంత్రులు నోరు మెదపకపోవడం వెనకాల బీజేపీ నాయకుల పాత్ర ఉందని ఆరోపించారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు మల్లు లక్ష్మి మాట్లాడుతూ ఎన్నికల ముందు మోదీ పార్లమెంట్‌లో 300 సీట్లు సాధిస్తామని చెప్పగా చావుతప్పి కన్ను లొట్టపోయినట్లుగా 240 సీట్లకే పరిమితమయ్యారని తెలిపారు. మోదీ దేవుని పేరుతో రాజకీయాలు చేసినప్పటికీ అయోధ్యతో పాటు అనేక ప్రాంతాల్లో బీజేపీ ఓటమి చెందిందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతు రుణమాఫీపై స్పష్టమైన ప్రకటనచేసి రైతాంగాన్ని ఆదుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తొలుత సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు పి.సోమయ్య పార్టీ బలోపేతంపై క్రమ శిక్షణ విధానాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కొలిశెట్టి యాదగిరిరావు, సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి, నాయకులు నెమ్మాది వెంకటేశ్వర్లు, పాలెపల్లి శేఖర్‌రావు, మట్టపల్లి సైదులు, మేదరపట్ల వెంకటేశ్వర్‌రావు, కోట గోపి, చెరుకు యాకలక్ష్మి, ధనియాకుల శ్రీకాంత్‌వర్మ, చిన్నపంగి నర్సయ్య, వీరబోయిన రవి, రణపంగి కృష్ణ, గుంజా వెంకటేశ్వర్లు, నెమ్మాది లక్ష్మి, మడ్డి అంజిబాబుగౌడ్, గుర్రం గోపాల్‌రెడ్డి, రాములు, పీరయ్య, రమేష్, నాగయ్య, శ్రీనివాస్, గోపిరెడ్డి పాల్గొన్నారు.

టీజీ పీఈ-సెట్‌లో రాష్ట్ర మొదటి ర్యాంక్

మోటకొండూరు, జూన్ 20: వ్యాయామ కళాశాలల్లో ప్రవేశాలకు నిర్వహించే ఫిజికల్ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్(టీజీ పీఈసెట్)లో ఉమ్మడి జిల్లా విద్యార్థిని రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంకు సాధించింది. టీజీ-పీఈసెట్ పరీక్షల ఫలితాలు గురువారం విడుదలయ్యాయి. యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండలం అమ్మనబోలుకు చెందిన చిట్టిమల్ల సంధ్య రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంక్ సాధించింది.

ట్రిబుల్ ఆర్ నిర్మాణానికి రైతులు సహకరించాలి

● చౌటుప్పల్ ఆర్డీవో శేఖర్‌రెడ్డి

వలిగొండ, జూన్ 20: రీజనల్ రింగ్ రోడ్డు (ట్రిబుల్ ఆర్) నిర్మాణానికి రైతులు సహకరించాలని చౌటుప్పల్ ఆర్డీవో శేఖర్‌రెడ్డి తెలిపారు. యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలకేంద్రంలోని రైతు వేదికలో గురువారం ట్రిబుల్‌ఆర్ నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఎవరు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు. సమావేశంలో తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, డి ప్యూటీ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య, సీనియర్ అసిస్టెంట్ సురేందర్‌శర్మ, ఎంఆర్‌ఐ కరుణాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మనస్తాపంతో బలవన్మరణం

దామరచర్ల, జూన్ 20: ఉరి వేసుకొని యువతి బలవన్మరణానికి పాల్పడింది. ఈ సంఘటన నల్లగొండ జిల్లా దామరచర్ల మండలకేంద్రంలో గురువారం జరిగింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచకు చెందిన దొడ్ల సురేష్ మండలంలోని యాదాద్రి థర్మల్ విద్యుత్ పరిశ్రమలో ఉద్యోగిగా పనిచేస్తూ దామరచర్లలో నివాసం ఉంటున్నాడు. అతనితోపాటు పాల్వంచకు చెందిన ప్రియాంక(34)తో సహజీవనం సాగిస్తున్నట్లు సమాచారం. ఇరువురి మధ్య మనస్పర్థలు రావడంతో తరుచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో తీవ్ర మనస్తాపానికి గురైన ప్రియాంక అద్దెకు ఉంటున్న ఇంట్లోనే చున్నీతో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. కొద్దిసేపటి తర్వాత గమనించిన సురేష్ చున్నీని కత్తిరించి కిందికి దించి 108కు సమాచారం అందించాడు. అప్పటికే ప్రియాంక మృతిచెందినట్లు 108 సిబ్బంది గుర్తించారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మిర్యాలగూడకు తరలించారు. ప్రియాంక మృతికి గల కారణాలను తెలుసుకునేందుకు పోలీసులు భర్తగా చెప్పుకుంటున్న సురేష్‌ను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ప్రియాంక బంధువులు దూరప్రాంతంలో ఉండడంతో వారు ఇక్కడికి వచ్చేందుకు సమయం పట్టనున్నట్లు తెలిసింది. ఈ సంఘటనకు సంబంధించి ఇప్పటివరకు పోలీసులకు ఫిర్యాదు అందలేదు.

సారా విక్రయిస్తున్న వారిపై కేసు

కొండమల్లేపల్లి, జూన్ 20: నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి మండల పరిధిలోని ఆంగోతుతండాకు చెందిన వ్యక్తి ఐదు లీటర్ల సారాను కొండమల్లేపల్లికి తీసుకెళ్తుండగా పోలీసులు గురువారం పట్టుకున్నారు. కొండమల్లేపల్లి ఆర్టీసీ బస్టాండ్‌లో నిర్వహించిన సదరు వ్యక్తిని పట్టుకొని సారా సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. అదేవిధంగా దేవరకొండలో ఓ మహిళ నాలుగు లీటర్ల సారా అమ్ముతుండగా అదుపులోకి తీసుకొని సారా సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు.

అందరికీ ఆరోగ్య యోగం

● యోగాతో సంపూర్ణ ఆరోగ్యం ● మానసిక ఒత్తిడి అధిగమించడానికి మార్గం ● నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవం

చిట్యాల రూరల్, జూన్ 20: చిట్యాలలో రెండున్నర దశాబ్దాల క్రితం కొందరితో మొదలైన యోగా శిక్షణ నేడు అందరికీ ఆరోగ్య యోగం కల్పిస్తోంది. యోగా సాధనకు సాధకులకు కేంద్రం అవసరమవ్వగా స్థానికంగా వనిపాకల రోడ్డులో రుషీ సంస్కృతి యోగా సేవా కేంద్రం పేరిట సిద్ధ సమాధియోగా ధ్యాన మంది రాన్ని నాలుగేళ్ల క్రితం నిర్మించారు. అందులో గురూజీ యోగా సాధన, ప్రాణాయామం, ధ్యానంతో పాటుగా మేధాశక్తిపై సాధకులకు శిక్షణని స్తుంటారు. ధ్యాన మందిరంలో సాధకులు నిత్యం సాధన చేస్తుం టారు. మరో ప్రాంతంలో ఎస్‌బీఐ వెనుక భాగంలో పత్రిజీ ఆధ్వర్యంలో ఏడాది క్రితం శ్రీవారిజాల వేణుగోపాలస్వామి పిరమిడ్ ధ్యాన కేంద్రం ఏర్పాటు చేశారు. నిత్యం 15మంది పిరమిడ్ కేంద్రంలో ధ్యానం చేస్తుంటారు.



చిట్యాలలో యోగా శిక్షణ ఇస్తున్న బాపూజీ గురూజీ



యోగాసనాలు చేస్తున్న డీఎస్పీ శ్రీలక్ష్మి(ఫైల్)



యోగాసనాల్లో దిట్ట డీఎస్పీ శ్రీలక్ష్మి

నల్లగొండ జిల్లా చిట్యాలకు చెందిన డీఎస్పీ తుమ్మల శ్రీలక్ష్మి యోగాసనాలు వేస్తూ యోగాసన పోటీల్లో పాల్గొని జాతీయ స్థాయిలో బంగారు, కాంస్య పతకాలు సాధించారు. హైదరాబాద్‌లో 1996లో ఎస్ఐగా, సీఐగా పనిచేసి డీఎస్పీగా పదోన్నతి పొందారు. ప్రస్తుతం అంబర్‌పేట్‌లోని పోలీస్ శిక్షణ కళాశాలలో విధులు నిర్వహిస్తున్నారు. 20 ఏళ్ల క్రితం తన ఫిట్‌నెస్ కోసం చేసిన యోగాలో శిక్షణ పొంది నిత్యం సాధన చేస్తుండే వారు. పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన యోగా పోటీల్లో పాల్గొన్న శ్రీలక్ష్మి 2015, 2016, 2017, 2022, 2023, 2024లో కాంస్య, బంగారు పతకాలు సాధించారు. రాష్ట్రం తరుపున యోగాసనాల పోటీల్లో పాల్గొని జాతీయస్థాయిలో ప్రతిభ కనబర్చి విజయాలు సొంతం చేసుకు న్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన డీఎస్పీ శ్రీలక్ష్మిని డీజీపీ రవిగుప్తా అభినందించారు.

యోగా శిక్షణతో ఆరోగ్య యోగం, ప్రాణశక్తి



ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలంటే యోగా శిక్షణ, ఆరోగ్యపు అలవాట్లలో మార్పు తప్పనిసరి. యోగా చేయడం కష్టమేమీ కాదు.. సులువైన పద్ధతిలోనే ఉంటుంది. శిక్షణలో ప్రాణాయామం చేయ డంతో ప్రాణశక్తి లభిస్తుంది. శ్వాసను ఉచ్వాస నిచ్వాస ద్వారా శిక్షణ ప్రాణశక్తి వస్తుంది. యోగా ద్వారా ఆహారపు అలవాట్లలో మార్పులు చేసుకుం టే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుంది. అంతేకాకుండా క్రమశిక్షణ కూడా అలవరమేకాకుండా మేధస్సును పెంపొందిస్తుంది.

● బాపూజి, యోగా గురూజీ, చిట్యాల

ధ్యానంతో మేధాశక్తి



ధ్యానం చేయడం ఎంతో ఉత్తమం. దాని ద్వారా మేధాశక్తిని పెంపొందించుకోవచ్చు. ధ్యానం చేయడం కష్టమైన పని తమ వల్ల కాదని అనుకోవద్దు. అందరికీ సాధ్యమైన పనే. ఒక ప్రాంతంలో కళ్లు మూసుకుని కూర్చుని శ్వాస మీద ధ్యాస పెట్టాలి. ధ్యానం చేస్తే మేధస్సును పెంపొందిచడంతో పాటు ఆరోగ్యం, మనస్సు స్థిమితం, ప్రశాంతంత కలుగు తుంది. నిత్యం ధ్యానం చేస్తూ రోజురోజుకు పెంచు కుంటే మెదడు శక్తివంతంగా మారుతుంది. .

● పున్న పాండు, యోగా శిక్షకుడు, చిట్యాల.



ఈ యోగా సిస్టర్స్ ప్రత్యేకం

నార్కట్‌పల్లి: అలవోకగా యోగాసనాలు వేస్తూ భళా అనిపించుకుంటున్నారు నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం బీ.వెల్లెంల జడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతున్న అక్కా చెల్లెళ్లు దాసోజు సంజన, సౌమ్య. నల్లగొండ మండలం అప్పాజిపేటకు చెందిన దాసోజు నర్సింహ్మాచారి వృత్తిరీత్యా స్వర్ణకారుడు. ఆయన కరాటే, యోగాలో పలువురికి శిక్షణ ఇచ్చేవాడు. ఆ సమయంలో కాలక్షేపం కోసం తన ఇద్దరు కూతుళ్లను తాను శిక్షణ ఇచ్చే యోగసనాలు చూపిచ్చేందుకు తీసుకెళ్లేవాడు. వారు కూడా అలవోకగా యోగసనాలు వేస్తూ అబ్బురపరిచారు. పిల్లల్లో యోగాసనాల పట్ల ఉన్న ఆసక్తిని గమనించిన నర్సింహ్మాచారి తానే గురువై కరాటేతో పాటు, యోగాసనాలు వేయడంలో తర్ఫీదునిచ్చాడు. ఉదయం ఓ సారి, పాఠశాలకు వెళ్లి ఇంటికి వచ్చిన తర్వాత సాయంత్రం వేళల్లో మరోసారి ఆసనాలు వేస్తూ అక్కా చెల్లెళ్లు ఇద్దరూ యోగాలో ప్రావీణ్యం సాధించారు. తండ్రి ప్రోత్సాహంతో పలు జిల్లా, రాష్ట్ర స్థాయి వేదికలపై యోగా, కరాటే పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబర్చారు. ప్రముఖుల నుంచి అవార్డులు అందుకున్నారు. సంజన పదో తరగతి పూర్తిచేయగా, సౌమ్య 10వ తరగతి చదువుతోంది.

యోగాలో సంజన, సౌమ్య ప్రశంసలు

- తక్కువ వయసులో ఎక్కువ ఆసనాలు వేసి తెలంగాణ తెలుగు బుక్ ఆఫ్ రికార్డు
- 2015లో నకిరేకల్‌లో ఏవీఎం పాఠశాలలో షాటోకాన్ కరాటే పోటీల సందర్భంగా కఠినమైన యోగసనాలు వేసి ఎమ్మెల్యే వేముల వీరేశం నుంచి ప్రతిభా అవార్డులు అందుకున్నారు.
- 2016లో ఆర్యసమాజ్ మందిర్‌లో జాతీయ దినోత్సవం సందర్భంగా యోగాసనాలు ప్రదర్శించి నగదు బహుమతి పొందారు
- 2017లో నల్లగొండలోని ఇండోర్ స్టేడియంలో జరిగిన యోగా పోటీల్లో పాల్గొని అప్పటి కలెక్టర్ సత్యానారాయణరెడ్డి నుంచి అభినందనలు.
- 2017 అక్టోబరు 13 నుంచి 15వ తేదీ వరకు సంగారెడ్డి జిల్లా సదాశివపేటలో జరిగిన 63వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి అండర్-17 విభాగంలో సంజన బంగారు పతకం అందుకుంది.
- మాస్టర్లే ఆశ్చర్యపడేలా యోగాసనాలు వేసిన యోగా సిస్టర్స్ సంజన, సౌమ్యలను అప్పటి ఎస్పీ ఏవీ రంగనాథ్ అభినందించారు.

లక్ష్మీనృసింహుడికి శాస్త్రోక్తంగా నిత్య తిరుకల్యాణం

భువనగిరి అర్బన్, జూన్ 20: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దివ్యక్షేత్రంలో గురువారం నిత్య తిరుకల్యాణోత్సవ పర్వాలు పాంచరాత్రాగమ రీతిలో వైభవంగా కొనసాగాయి. ప్రధానాలయ నైరుతి దిశలో అష్టభుజి ప్రాకార మండపంలో ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలు, ముత్యాలు, బంగారు, వజ్రాభరణాలతో దివ్యమనోహరంగా అలంకరించిన ఆచార్యులు గజవాహన సేవలో తీర్చిదిద్ది వేదమంత్ర పఠనాలు, మంగళవాయిద్యాల నడుమ సేవోత్సవం చేపట్టారు. ఉత్సవమూర్తులను కల్యాణమండపంలో అధిష్ఠింపజేసి, విశ్వక్సేనుడి తొలిపూజలతో కల్యాణతంతు కొనసాగింది. కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులకు అర్చకులు స్వామివారి శేషవస్త్రాలు అందజేసి, ఆశీర్వచనం చేశారు. ముందుగా సుదర్శన శతక పఠనంతో హోమం పూజలు నిర్వహించారు. ప్రభాతవేళ గర్భాలయంలోని స్వయంభువులను సుప్రభాతంతో మేల్కొలిపి అర్చకస్వాములు నిజాభిషేకం, నిత్యార్చనలు చేపట్టారు. పాతగుట్ట ఆలయంలో సాంప్రదాయరీతిలో నిత్య పూజలు వైభవంగా జరిగాయి. కొండపైన శివాలయంలో పర్వత వర్ధిని సమేత రామలింగేశ్వరస్వామికి నిత్య పూజలు, యాగశాలలో నిత్య రుద్రహవనం, శైవాగమ పద్ధతిలో నిర్వహించారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ. 26,14,890 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో ఏ.భాస్కర్‌రావు తెలిపారు. లక్ష్మీనృసింహుడిని దర్శించుకున్న భక్తులు హుండీల్లో సమర్పించిన కానుకలను ఈ నెల 27న ఉదయం 7గంటలకు కొండకింద రెండో వ్రతమండపంలో లెక్కింపు నిర్వహించనున్నట్లు ఈవో భాస్కరరావు తెలిపారు.కొండకింద యాదగిరిపల్లిలోని లక్ష్మీహయగ్రీవ స్వామి ఆలయంలో ఈనెల 21నుంచి 26 వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. 23వ తేదీన ఎదుర్కోళ్ల ఉత్సవం, 24న కల్యాణోత్సవం, 25న రథోత్సవం, 26వ తేదీన జరిగే చక్రతీర్థం, మహాపూర్ణాహుతి కార్యక్రమం నిర్వహిస్తారు.



ప్రధానాలయంలో తిరుకల్యాణోత్సవ పర్వాలు నిర్వహిస్తున్న అర్చకులు

'పేట'లో ఎనిమిది కిలోల గంజాయి పట్టివేత

● బైక్‌పై తీసుకెళ్తుండగా స్వాధీనం చేసుకున్న పోలీసులు

భానుపురి, జూన్ 20: సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఎనిమిది కిలోల గంజాయిని పోలీసులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. పట్టణ పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సూర్యాపేట డీఎస్పీ రవి కేసు వివరాలు వెల్లడించారు. సూర్యాపేట పట్టణంలోని ఖమ్మంక్రాస్‌రోడ్డులో అమ్మగార్డెన్ సమీపంలోని రోడ్డుపై పట్టణ పోలీసులు ఉదయం ఏడు గంటల ప్రాంతంలో వాహనాలు తనిఖీ చేస్తున్నారు. అనుమానాస్పదంగా బైక్‌పై వెళ్తున్న ముగ్గురిని ఆపి తనిఖీ చేశారు. చింతలచెర్వుకు చెందిన కోడిదల పవన్‌కుమార్, శ్రీరాంనగర్‌కు చెందిన మన్నె రాహుల్, సూర్యాపేటకు చెందిన మైనర్ బాలుడు ఉన్నారు. వీరిలో ఒకరి చేతిలో నలుపు, గులాబీ రంగు గల బ్యాగ్ లోపల నాలుగు గోధుమ రంగు టేప్‌తో చుట్టిన ప్యాకెట్లలో గంజాయి ఉంది. వీరిని విచారించగా పవన్, అబ్దుల్ రహీం కలిసి ఖమ్మం నుంచి ట్రైన్‌లో ఏపీ రాష్ట్రంలోని అరకు వెళ్లి అక్కడ గంజాయి రూ. 8వేల చొప్పున ఎనిమిది కిలోలు కొనుగోలు చేశారు. అక్కడి నుంచి ఖమ్మం వచ్చారు. రాహుల్ తన బైక్‌పై ఖమ్మం వెళ్లి వారిని ఎక్కించుకుని సూర్యాపేటకు గంజాయి తీసుకొస్తుండగా పట్టుపడ్డారు. సూర్యాపేటలో కేజీ రూ.20నుంచి రూ.30వేల వరకు విక్రయించేందుకు తీసుకొచ్చినట్లు నిందితులు తెలిపారని పేర్కొన్నారు. గంజాయి స్వాధీనం చేసుకుని ముగ్గురిపై కేసు నమోదు చేసి జైలుకు పంపినట్లు డీఎస్పీ తెలిపారు. కేసును చేధించిన పట్టణ సీఐ రాజశేఖర్, పట్టణ ఎస్ఐలు మహేంద్రనాథ్, కుశలవ, క్రైమ్ హెడ్ కానిస్టేబుల్ కృష్ణ, కరుణాకర్, సైదులు, కానిస్టేబుళ్లు ఆనంద్, మధును ఏఎస్పీ అభినందించారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రవి

కారులో వచ్చి మేకలు అపహరించి..

పెద్దఅడిశర్లపల్లి, జూన్20: నెంబర్ ప్లేటు లేని కారులో తిరుగుతున్న గుర్తుతెలియని వ్యక్తులు మేకలను అపహరిస్తున్నారు. ఇంటి వద్ద పాకలో కట్టేసిన మేకలను దొంగిలించడమే లక్ష్యం తిరుగుతున్నారు. నెలలో మోటర్ కేబుల్ దొంగతనం మరువకముందే బుధవారం రాత్రి కారులో వచ్చిన దొంగలు గుడిపల్లి మండలంలోని రాయినిపాలెం గ్రామానికి చెందిన శాస్త్రీ సుందరయ్య అనే వ్యక్తి మేకల మందపై పడి నాలుగు మేకలను కారులో వేసుకొని పరారయ్యారు. వీటి విలువ సుమారు రూ. 60 వేలు ఉంటుందని బాధితుడు తెలిపాడు. అదేవిధంగా పీఏపల్లి మండలం మేకలవారిగూడెం చెందిన నారబోయిన మల్లయ్యకు చెందిన మేకల మంద నుంచి మేకను దొంగిలించి కారులో ఎక్కించుకుని పోతుండగా కారు అడ్డగించడంతో రీవర్స్ తీసుకుని పారిపోయారని బాధితుడు తెలిపాడు. దీని విలువ సుమారు రూ.15 వేలు ఉంటుందని బాధితుడు తెలిపాడు

ఆరోపణలపై విచారణ

మర్రిగూడ, జూన్ 20: నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలంలోని ఉపాధి హామీ పథకం ప్రాజెక్టు అధికారి వెంకటేష్‌పై డీఆర్‌డీవో అదనపు పీడీ నవీన్‌కుమార్ గురువారం మండల పరిషత్ కార్యాలయంలో విచారణ నిర్వహించారు. ఏపీవో ఫీల్డ్ అసిస్టెంట్‌లను వేధింపులకు గురిచేస్తూ ఫోన్‌పే ద్వారా డబ్బులు పంపాలని బెదిరింపులకు గురిచేస్తున ఆరోపణలపై, అదేవిధంగా ఏపీవో వెంకటేష్ ఫీల్డ్ అసిస్టెంట్‌లు సక్రమంగా విధులు నిర్వహిస్తా లేరంటూ ఎంపీడీవో మున్నయ్యకు ఫిర్యాదు చేశారు. మే 21న చేసిన ఫిర్యాదు మేరకు జిల్లా అధికారులకు తెలిపారు. ఫిర్యాదులపై అదనపు పీడీ విచారణ నిర్వహించారు. జిల్లా పీడీకి నివేదికను పంపనున్నట్లు తెలిపారు. ఆయనవెంట దేవరకొండ ఉపాధిహామీ క్లస్టర్ అధికారి బాలకృష్ణ, ఉపాధి హామీ సిబ్బంది ఉన్నారు.

ప్రాణం కాపాడిన బ్లూకోట్స్ సిబ్బంది

● గుండెనొప్పితో బాధపడుతున్న లారీ డ్రైవర్‌ను ఆస్పత్రికి తరలింపు

● సకాలంలో తీసుకెళ్లడంతో దక్కిన ప్రాణం

చౌటుప్పల్ రూరల్, జూన్ 20: గుండెనొప్పితో బాధపడుతున్న లారీ డ్రైవర్‌ను బ్లూకోట్స్ సిబ్బంది సకాలంలో ఆస్పత్రికి తరలించి ప్రాణాలు కాపాడారు. బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్‌లో ఈ సంఘటన జరిగింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరుకు చెందిన వెంకటరమణ(53)కు సొంత లారీ ఉంది. కుమారుడు అర్జునకుమార్‌తో బుధవారం మధ్యాహ్నం లోడ్ లారీతో హైదరాబాద్‌కు బయలుదేరారు. బుధవారం అర్ధరాత్రి చిట్యాల వద్దకు రాగానే వాహనం నడుపుతున్న వెంకటరమణకు గుండెనొప్పి వచ్చింది. దీంతో 25కిలోమీటర్ల దూరంలో ఉన్న చౌటుప్పల్ వరకు కుమారుడు అర్జునకుమార్ వాహనం నడిపాడు. చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని తంగడపల్లి చౌరస్తా వద్ద నిలిపి పెట్రోలింగ్ చేస్తున్న బ్లూకోట్స్ పోలీసులు నాగరాజు, వెంకటేశంకు విషయం చెప్పాడు. వారు వెంటనే సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రికి సమాచారం ఇచ్చారు. ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంకటరమణను తమ వాహనంపై ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యులు పరీక్షించి వెంకటరమణ పరిస్థితి విషమంగా ఉందని చెప్పడంతో అంబులెన్స్‌ను రప్పించి హైదరాబాద్‌కు పంపించారు. అక్కడి వైద్యులు వెంకటరమణకు మెరుగైన చికిత్స అందించి ప్రాణాలు కాపాడారు. సకాలంలో ఆస్పత్రికి తరలించి వెంకటరమణ ప్రాణాలు కాపాడిన బ్లూకోట్స్ సిబ్బందిని సీఐ ఆశోకొరెడ్డి అభినందించారు.



చికిత్స పొందుతున్న వెంకటరమణ

వ్యక్తిగత పరిశుభ్రతతోనే నులిపురుగుల నివారణ

● చివ్వెంల ఎంపీడీవో సంతోష్‌కుమార్ ● జిల్లా వ్యాప్తంగా పాఠశాలల్లో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ



మఠంపల్లిలో బాలికకు మాత్రలు వేస్తున్న డాక్టర్ సుధాకర్‌నాయక్



చివ్వెంలలో బాలికకు ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న ఎంపీడీవో సంతోష్‌కుమార్

చివ్వెంల, జూన్ 20: వ్యక్తిగత పరిశుభ్రతతో నులిపురుగులను నివారించవచ్చని ఎంపీడీవో సంతోష్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం కళావతి, పంచాయతీ కార్యదర్శి రజిని, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మఠంపల్లి: నులిపురుగుల నివారణకు ప్రతి ఒక్కరూ మాత్రలు వేసుకోవాలని డాక్టర్ సుధాకర్ నాయక్ అన్నారు. మండల కేంద్రంలోని గురుకుల పాఠశాలలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీవో జానకిరాములు, ఎంపీటీసీ ప్రభుదాసు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్: పట్టణంలోని పలు పాఠశాలల్లో విద్యార్థులకు ఆర్‌బీఎస్‌కే టీం ఆధ్వర్యంలో ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ నాగేందర్, ఆర్‌బీఎస్‌కే డాక్టర్ మంగ, ఆదిశంకర్, ఏఎన్ఎం వరలక్ష్మి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

చిలుకూరు: మండల వ్యాప్తంగా వివిధ గ్రామాల్లోని పాఠశాలల విద్యార్థులకు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో నులి పురుగుల నివారణ మాత్రలను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమాన్ని మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంపీడీవో గిరిబాబు ప్రారంభించారు. కార్యక్రమాల్లో హెచ్ఎంలు కరుణాకర్‌రెడ్డి, గుజ్జుల నర్సిరెడ్డి, డాక్టర్ ప్రియాంక, సీహెచ్‌వో వినోద్, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

తిరుమలగిరి: నులిపురుగుల నివారణకు ఒకటి నుంచి 19ఏళ్ల వయసు ఉన్నవారికి తప్పనిసరిగా ఆల్బెండజోల్ మాత్రలు వేయించాలని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ పి.వెంకటరమణ, మునిసిపల్ చైర్‌పర్సన్ శాగంటి అనసూయ అన్నారు. గురువారం తిరుమలగిరి మునిసిపాలిటీ కేంద్రంలోని పలు పాఠశాలల్లో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించి మాట్లాడారు. ప్రతి ఆరు నెలలకోసారి ఆల్బెండజోల్ మాత్రలు వేయించాలన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ రామదుర్గారెడ్డి, డాక్టర్ మల్లెల వందన, ఎంఈవో శాంతయ్య, సీహెచ్‌వో బిచ్చునాయక్ పాల్గొన్నారు.

తిరుమలగిరి రూరల్: తిరుమలగిరి ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎం వెంకటమ్మ, ఎంఈవో శాంతయ్య, హెచ్ఎం అశోక్‌రెడ్డి, అశోక్, సోమయ్య, వెంకట్, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

తుంగతుర్తి: మండలంలోని రావులపల్లి పీహెచ్‌సీ పరిధిలో ఉన్న అన్ని గ్రామాల్లో ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి లింగమూర్తి, ఎంఈవో బోయిని లింగయ్య, ఎంపీడీవో భీమ్‌సింగ్, ఆరోగ్య విస్తరణాధికారి సముద్రాల సూరి, హెచ్ఈవో రవి, డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ సురేష్‌కుమార్, పీహెచ్ఎన్ సైదమ్మ, జానకమ్మ, హెల్త్ అసిస్టెంట్లు సోమన్న, నర్సింహాచారి, యాదగిరి, విజయ్‌కుమార్, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నూతన్‌కల్: మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లోని పాఠశాలల్లో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను వైద్య సిబ్బంది పంపిణీ చేశారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మాత్రలను ఎంపీపీ భూరెడ్డి కళావతి, జడ్పీటీసీ కందాళ దామోదర్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో రాములునాయక్, వైద్యాధికారి ఆశ్రితరెడ్డి, హెచ్ఎంలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



హుజూర్‌నగర్‌లో ఆల్బెండజోల్ మాత్రలను వేస్తున్న ఆర్‌బీఎస్‌కే సభ్యుడు



నూతన్‌కల్‌లో మాత్రలు వేస్తున్న ఎంపీపీ కళావతి, జడ్పీటీసీ దామోదర్‌రెడ్డి



తిరుమలగిరిలో విద్యార్థులకు మాత్రలు వేస్తున్న మునిసిపల్ చైర్‌పర్సన్ అనసూయ

వైభవంగా శ్రీలక్ష్మీనృసింహుని కల్యాణం

మఠంపల్లి, జూన్ 20: మట్టపల్లి క్షేత్రంలో గురువారం శ్రీలక్ష్మీనృసింహుని నిత్య కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, పంచగవ్యప్రాసన అనంతరం స్వామివారికి మాంగల్యధారణ, తలంబ్రాలతో నిత్య కల్యాణాన్ని జరిపించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈవో నవీన్, అర్చకులు పాల్గొన్నారు.

మున్నూరు కాపు సంఘం రాష్ట్ర నేతగా సులోచన

కోదాడ టౌన్, జూన్ 20: మున్నూరు కాపు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా కోదాడకు చెందిన నూనె సులోచనను నియమించినట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండా దేవయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు జిల్లేపల్లి వెంకటేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సులోచన నియామకంపై పట్టణ గౌరవ అధ్యక్షుడు పారా సీతయ్య, కోదాడ నియోజకవర్గ అధ్యక్షుడు బండ్ల కోటయ్య, కోదాడ పట్టణ అధ్యక్షులు నన్నీరు మురళి తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

ఎల్-2, ఎల్-3 కాల్వలకు సీసీ లైనింగ్ చేపట్టాలి

చిలుకూరు, జూన్ 20: మండలంలోని ఎల్-2, ఎల్-3 కాల్వలకు సీసీ లైనింగ్ ఏర్పాటు చేయాలని టీడీపీ నాయకులు కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే పద్మావతికి గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎల్-2, ఎల్-3 కాల్వ పరిధిలో రెండువేల ఎకరాల ఆయకట్టు ఉందని, కాల్వలకు తరచుగా గండ్లు పడుతున్నందున రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో కొండా సోమయ్య, కొల్లు సత్యనారాయణ, మస్తాన్ ఉన్నారు.

మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం కృషి : ఎమ్మెల్యే

కోదాడ, జూన్ 20: మైనార్టీల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే పద్మావతి అన్నారు. గురువారం పట్టణంలోని సాలార్జింగ్ పేటలో రూ.25లక్షలతో నిర్మిస్తున్న ప్రహరీ నిర్మాణానికి ఆమె శంకుస్థాపన చేసి మాట్లాడారు. నియోజకవర్గంలోని ఈద్గాలు అభివృద్ధికి, షాదీఖానాల నిర్మాణాలకు కృషి చేస్తామన్నారు. పెండింగ్‌లో ఉన్న ఇమాం, మౌజంల గౌరవ వేతనాన్ని ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. మైనార్టీలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు, టీపీసీసీ డెలిగేట్ సీహెచ్ లక్ష్మీనారాయణరెడ్డి, వంగవీటి రామారావు, జబ్బార్, ఖదీర్, వీరబాబు, రవి, రామారావు, దేవమణి తదితరులు పాల్గొన్నారు.

మోతె: మండల కేంద్రంలో నూతనంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేకు పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకుడు ఎల్ఎన్ రాజు ఎమ్మెల్యే పద్మావతికి వినతిపత్రం అందజేశారు.

● మోతె మండలంలోని 22ఎల్ ఎస్సారెస్పీ కాల్వ వెంబడి ఉన్న ఉర్లుగొండ రెవెన్యూ పరిధిలో ఉన్న రైతులు కాల్వకు ఆనుకుని ఉన్న భూములను ఆక్రమించుకోవడంతో కాలిబాటలు కూడా లేకుండా పోయాయని, వాటిని ఆక్రమించుకున్న వారిపై చర్యలు చేపట్టి మొక్కలు నాటాలని రాంపురంతండాకు చెందిన బాలాజీనాయక్ గ్రామస్థులతో కలిసి ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు

ప్రజాసేవే జనసేన లక్ష్యం



దేవాలయంలో అన్నదానం చేస్తున్న జనసైనికులు

గరిడేపల్లి, జూన్ 20: ప్రజాసేవే జనసేన లక్ష్యమని ఆ పార్టీ హుజూర్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి సరికొప్పుల నాగేశ్వరరావు అన్నారు. ఏపీ రాష్ట్రంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో జనసేన పోటీ చేసిన అన్ని స్థానాల్లో విజయం సాధించడంతో పాటు పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ ఉప ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా గురువారం మండల కేంద్రంలోని సాయిబాబా దేవాలయంలో గరిడేపల్లి, నేరేడుచర్ల మండలాల జన సైనికులు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమానికి జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి సరికొప్పుల నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో జనసేన పార్టీని బలోపేతం చేస్తామన్నారు. పవన్ కల్యాణ ఉప ముఖ్యమంత్రిగా ప్రజల మన్ననలను అందుకుంటారన్నారు. కార్యక్రమంలో నర్సింహాచారి, నరేష్, జంపాల సతీష్, మోదాల అంజి, కొమ్మరాజు శ్రీను, అనిల్ నాయుడు, చందు, సాయిచరణ్, వాసునాయుడు, ప్రసాద్‌బాను, కరుణాకర్, శివ, వీరబాబు, తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలను పరిష్కరించాలి



డీటీ నిర్మలకు అందజేస్తున్న ఏఐకేఎంఎస్ నాయకులు

తుంగతుర్తి, జూన్ 20: రైతుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) జిల్లా కార్యదర్శి బొడ్డు శంకర్ కోరారు. ఈ మేరకు వినతిపత్రాన్ని తుంగతుర్తి తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ నిర్మలకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరి కారణంగా రైతుల పరిస్థితి అగమ్య గోచరంగా మారిందన్నారు. నకిలీ విత్తనాలను అరికట్టాలని, బాధ్యులైన వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. రైతులకు సరిపడా ఎరువులు, విత్తనాలు, పురుగుల మందులు వ్యవసాయ పరికరాలు సబ్సిడీపై అందించాలని కోరారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలెబోయిన కిరణ్, ఎస్‌డీఎల్సీ నాయకుడు తడకమళ్ల సంజీవ్, చిప్పలపల్లి మధు, అశోక్ పాల్గొన్నారు.

జిల్లాను అభివృద్ధి పథంలో నడిపిస్తున్న మంత్రి



కోదాడలో కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నేతలు

కోదాడ, జూన్ 20: భారీ నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలను కోదాడ మునిసిపల్ కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. చైర్‌పర్సన్ సామినేని ప్రమీల, వైస్ చైర్మన్ కందుల కోటేశ్వరరావు ఆధ్వర్యంలో కౌన్సిలర్లతో కలిసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపిస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఇటువంటి పుట్టినరోజు వేడుకలను మరెన్నో జరుపుకోవాలని, భవిష్యత్ ఉన్నతమైన పదవులను అందుకుని ప్రజలకు సేవలు అందించాలన్నారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ రమాదేవి, మేనేజర్ రాబిన్, కౌన్సిలర్లు, గంధం యాదగిరి, షాబుద్దీన్, మదార్, కర్రి సుబ్బారావు, పెండెం వెంకటేశ్వర్లు, గుండెల సూర్యనారాయణ, వెంపటి మధుసూదన్, షైన రమేష్, నెమ్మాది దేవమణి, యాదగిరి, పాల్గొన్నారు.

కోదాడ టౌన్: మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలను కోదాడలోని హుజూర్‌నగర్ రోడ్డులో కోదాడ మాజీ సర్పంచ్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు ఎర్నేని కుసుమ, వెంకటరత్నంబాబు, నెమ్మాది దేవమణి, ప్రకాష్‌బాబుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మునిసిపల్ చైర్‌పర్సన్ సామినేని ప్రమీల, పీసీసీ ప్రతినిధి చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి, పట్టణ అధ్యక్షుడు వంగవీటి రామారావు కేట్ కట్ చేశారు. అనంతరం పేదలకు అల్పాహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో నెమ్మాది ప్రకాష్‌బాబు, దేవమణి, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

● కోదాడలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ ముత్తవరపు పాండురంగారావు, మునిసిపల్ వైస్ చైర్మన్ కందుల కోటేశ్వరరావు, కొల్లా కోటిరెడ్డి, కర్రి సుబ్బారావు, కంపాటి శ్రీను, పాలూరి బాజాన్, బాగ్దాద్, తిరుపయ్య పాల్గొన్నారు.

కోదాడ రూరల్: మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలను కోదాడ నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో కాంగ్రెస్ పార్టీ దివ్యాంగుల విభాగం రాష్ట్ర నాయకుడు షేక్ రఫీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. లక్ష్మీపురం కాలనీలోని దివ్యాంగులకు రఫీ తన ఇంటిలో అన్నదానం ఏర్పాటు చేశారు.

మఠంపల్లి: మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హయాంలోనే మండలం అభివృద్ధి జరిగిందని కాంగ్రెస్ నాయకుడు ఆదూరి కిషోర్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు.

నేరేడుచర్ల: ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలను నేరేడుచర్ల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొణతం చినవెంకటరెడ్డి, మునిసిపల్ చైర్మన్ బచ్చలకూరి ప్రకాష్ కేక్ కట్ చేసి స్వీట్లు పంచి పెట్టారు. కార్యక్రమంలో చిత్తనూరి సత్యనారాయణ, యామిని వీరయ్య, కొణతం చినసీతారాంరెడ్డి, కుంకు శ్రీను, భరత్, శ్రీను, ఆదిరెడ్డి, పాండునాయక్, ఖాదర్, కోటేశ్వరావు, వెంకన్న, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పాలకవీడు: ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా మండలంలోని జాన్‌పహాడ్ దర్గాలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎంపీపీ భూక్యా గోపాల్, జడ్పీటీసీ మాలోతు బుజ్జిమోతీలాల్‌ల ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంచి పెట్టారు. రూ.75వేల విలువైన దుస్తులను 220 మంది విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు సుబ్బారావు, నాయకులు నర్సింహారావు, నీమా నాయక్, పిన్నెల్లి ఉపేందర్, మోతీలాల్, వెంకటరెడ్డి, భాస్కర్ రెడ్డి, సైదులు, మధునాయక్, శ్రీకాంత్, శేషు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్: ఉత్తమ్‌కుమార్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా హుజూర్ నగర్‌లోని ముత్యాలమ్మ ఆలయంలో మునిసిపల్ మాజీ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్ ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ గెల్లి అర్చనరవి, వైస్ చైర్మన్ కోతి సంపత్‌రెడ్డి, తన్నీరు మల్లికార్జున్, అరుణ్‌కుమార్ దేశ్‌ముఖ్, నాగన్నగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



హుజూర్‌నగర్‌లో కేక్ కట్ చేస్తున్న మునిసిపల్ మాజీ చైర్మన్ శ్రీనివాస్

అధికారులు అందుబాటులో లేకుంటే చర్యలు



మోతె మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పద్మావతి

మోతె, జూన్ 20: అధికారులు ప్రజలకు అందుబాటులో లేకుంటే చర్యలు తీసు కుంటామని ఎమ్మెల్యే పద్మావతి హెచ్చరించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ముప్పాని ఆశ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై ప్రజాప్రతినిధులు, ప్రజలు లిఖిత పూర్వకంగా సమాచారం ఇస్తే పరిష్కరిస్తానన్నారు గత ప్రభుత్వంలో పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తిచేయిస్తానని హామీ ఇచ్చారు. నేరేడువాయి పరిధిలో తాగునీటి కొరత లేకుండా చూడాలని ఎంపీపీ కోరారు. మండలంలోని తాగునీటి సమస్య తలెత్తకుండా రూ.30 లక్షలతో పనులు చేసినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మణికంఠ తెలిపారు. రూ.6కోట్లతో లింకు రోడ్ల నిర్మాణం, నేరేడువాయి నుంచి ఖమ్మం జిల్లాకు వెళ్లే దారిలో రూ.2 కోట్లతో వంతెనను నిర్మిస్తున్నట్లు పీఆర్ ఏఈ రంగారావు తెలిపారు. శిథిలమైన పశువైద్య కేంద్రాల భవనాలకు మరమ్మతులు చేపట్టాలని పశు వైద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి సభ దృష్టికి తీసుకొచ్చారు. విద్యుత్ ఏఈ ప్రజలకు అందుబాటులో ఉండడంలేదని పలువురు ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. ప్రజలకు అందుబాటులో ఉంటానని ఏఈ శాంతి హామీ ఇచ్చారు. గ్రామాల్లో అమ్మ ఆదర్శ పాఠశాల్లో చేపడుతున్న పనులు ముందుకు సాగడంలేదని ఎంపీటీసీలు ఆరోపించారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రాహుల్‌గాంధీ పుట్టినరోజు వేడుకల సందర్భంగా మండల పరిషత్ కార్యాలయంలో ఎమ్మెల్యే మొక్కలు నాటారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఎంపీటీసీల పదవీ కాలం గురువారంతో ముగుస్తున్నందున మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ, జడ్పీటీసీ, ఎంపీటీసీలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ గుజ్జ దీపిక, ఎంపీపీ ముప్పాని ఆశ, జడ్పీటీసీ పందిళ్లపల్లి పుల్లారావు, ఆర్డీవో వేణు, తహసీల్దార్ సంఘమిత్ర, ఇన్‌చార్జి ఎంపీడీవో హరిసింగ్‌నాయక్, సూపరింటెండెంట్ వెంకటాచారి, మండల అధ్యక్షుడు కీసర సంతోష్‌రెడ్డి, మైనంపాటి గుర్వారెడ్డి, నూకల మధుసూధన్ రెడ్డి, సామ వెంకట్‌రెడ్డి, ఆంగోత్ నాగునాయక్, వివిధ గ్రామాల నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

సూర్యాపేటఅర్బన్, జూన్ 20: ప్రభుత్వ నిబంధనలు పాటించని ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఆవుల నాగరాజు అన్నారు. ఈ మేరకు గురువారం జిల్లా కేంద్రంలో డీఈవో అశోక్‌కు వినతి పత్రం అందజేసి మాట్లాడారు. ఫీజుల పేరుతో దోపిడీకి పాల్పడుతున్నా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ పాఠశాలల్లో కనీస వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. డీఈవోకు వినతిపత్రం అందజేసిన వారిలో నాయకులు వినయ్‌కుమార్, నవీన్, ఉదయ్, అరుణ్ పాల్గొన్నారు.



డీఈవో అశోక్‌కు వినతిపత్రం అందజేస్తున్న పీడీఎస్ఎఫ్ నాయకులు

ఫణిగిరి పంచాయతీ కార్యదర్శి మృతి



జిందగిరి (ఫైల్ ఫొటో)

నాగారం, జూన్ 20: మండలంలోని ఫణిగిరి గ్రామ పంచాయతీ కార్యదర్శి జోగునూరి జిందగిరి(41)అనారోగ్యంతో హైదరాబాద్‌లో మృతి చెందారు. జిందగిరికి భార్య, కుమారుడు ఉన్నారు. ఆయన చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోయారు. నాలుగేళ్ల క్రితం పంచాయతీ కార్యదర్శిగా ఎంపికైన జిందగిరి మొదటి పోస్టింగ్‌లో ఫణిగిరికి వచ్చారు. రెండు నెలల క్రితం బ్రెయిన్ స్ట్రోక్ వచ్చింది. అప్పటినుంచి హైదబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా, గురువారం గుండెపోటు రావడంతో మృతిచెందారు. జిందగిరి చిత్రపటానికి నాగారం ఎంపీడీవో దార శ్రీనివాస్, ఏపీవో రవి, సీనియర్ అసిస్టెంట్ ముత్తయ్య, జూనియర్ అసిస్టెంట్లు వెంకన్న, జాని, పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు కొమ్ము అరుణ్, పలువురు కార్యదర్శులు నివాళులర్పించారు. స్వగ్రామం తుంగతుర్తి మండలం రావులపల్లిలో జిందగిరి అంత్యక్రియలను కుటుంబ సభ్యులు శుక్రవారం నిర్వహిస్తారని ఎంపీడీవో తెలిపారు.

ఎన్నికల హామీలను నెరవేర్చాలి



సూర్యాపేటలో మాట్లాడుతున్న గంట నాగయ్య

.సూర్యాపేటటౌన్, జూన్ 20: అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని ఇఫ్టు జిల్లా ప్రధాన కార్యదర్శి గంట నాగయ్య అన్నారు. గురువారం సూర్యాపేటలోని చంద్ర పుల్లారెడ్డి విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తొమ్మిదిన్నర ఏళ్ల పాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం కార్మికుల సమస్యలను పూర్తిగా విస్మరించిందని, నూతనంగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్మికులకు కనీస వేతనం రూ.27 వేలను సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా అమలు చేస్తామని కేంద్ర ప్రభుత్వం మాట్లాడడం దారుణమన్నారు. కార్యక్రమంలో కామల్ల నవీన్, సైదులు, కామల్ల శ్రీను, నర్సింహారావు, సామ నర్సిరెడ్డి, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

సూర్యాపేట టౌన్, జూన్ 20: జిల్లా కేంద్రంలోని అగ్నిమాపక కేంద్రం పక్కన ఉన్న సాంఘిక సంక్షేమ పాఠశాలలో నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని డీఎంహెచ్‌వో కోటాచలం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం ఏడు గంటల నుంచి తొమ్మిది గంటల వరకు జరిగే యోగా కార్యక్రమంలో విద్యార్థులు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు.

పెంచికల్‌దిన్నె చెరువు సర్వే



చెరువును సర్వే చేస్తున్న అధికారులు

నేరేడుచర్ల, జూన్ 20: మండలంలోని పెంచికల్‌దిన్నె ఊర చెరవును సర్వేయర్ గాయత్రి, రెవెన్యూ సిబ్బంది బుధవారం సర్వే చేశారు. ఊరు చెరువు కబ్జాకు గురవుతోందని ఆ గ్రామస్థులు కలెక్టర్‌కు ఇటీవల ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు చెరవును సర్వే చేయాలని తహసీల్దార్ సైదులు ఆదేశించడంతో సర్వే నిర్వహించారు. పంచనామా అనంతరం హద్దులు నిర్ణయిస్తామని అధికారులు తెలిపారు.

ధరలను నియంత్రించడంలో ప్రభుత్వాలు విఫలం



కూరగాయల దుకాణంలో టమాటాలను చూపుతున్న సీపీఐ నాయకులు

నేరేడుచర్ల, జూన్ 20: కూరగాయల ధరలను నియంత్రించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడుధూళిపాళ ధనుంజయనాయుడు విమర్శించారు. సీపీఐ బృందంతో కలిసి పట్టణంలోని కూరగాయల మార్కెట్‌ను గురువారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వారం రోజుల్లో కూరగాయల ధరలు విపరీతంగా పెరిగాయని, దళారీ వ్యవసను అరికట్టి ధరలను నియంత్రించాలని కోరారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు చిలకరాజు శ్రీను, నాయకులు కొమ్మరాజు వెంకట్, బెల్లంకొండ గోవిందు, మర్రి నాగేశ్వరావు, గుండు నాగేశ్వరావు, రామస్వామి, మట్టయ్య, సైదానాయక్ తదితరులు పాల్గొన్నారు.

మద్దతు ధర పెంచడం హర్షణీయం

తుంగతుర్తి, జూన్ 20: కేంద్ర ప్రభుత్వం రైతులకు మద్దతు ధర పెంచడం హర్షణీయమని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లెపాక సాయిబాబా అన్నారు. గురువారం తుంగతుర్తి నియోజకవర్గ కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో వరికి మద్దతు ధర క్వింటాల్‌కు రూ.1400 ఉంటే, మోదీ హయాంలో ప్రస్తుతం రూ.2,300కు చేరిందన్నారు. ప్రధాని మోదీ మూడోసారి అధికారంలోకి రాగానే ఇచ్చిన హామీ ప్రకారం కిసాన్ సమ్మాన్ నిధి నిధులు విడుదల చేయడం, రైతులకు మద్దతు ధర పెంచడం హర్షణీయమని అన్నారు. సమావేశంలో బీజేపీ మండల అధ్యక్షుడు గాజుల మహేందర్, ఇప్పుల లింగయ్య, కత్తుల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

‘చలో వరంగల్‌ను విజయవంతం చేయాలి’

కోదాడ, జూన్ 20: వరంగల్‌లో జులై ఏడో తేదీన నిర్వహించే ఎమ్మార్పీఎస్ సభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఏపూరి రాజు కోరారు. గురువారం ఎంఎస్ కళాశాలలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ ఉద్యమం ప్రారంభమై జూలై ఏడో తేదీ నాటికి 30 సంవత్సరాలు పూర్తవుతుందన్నార ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణే తమ లక్ష్యమని అన్నారు. సమావేశంలో కోటేష్, ఆంజనేయులు, శ్రీను, అంజయ్య, సత్యరాజు పాల్గొన్నారు.

23న మల్సూర్ జీవిత చరిత్ర పుస్తకావిష్కరణ

నూతన్‌కల్, జూన్ 20: తెలంగాణ సాయుధ పోరాట యోధుడు దివంగత తొట్ల మల్సూర్ జీవిత చరిత్ర పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గౌడ సంఘం జిల్లా నాయకుడు నాయకుడు తొట్ల ప్రభాకర్‌గౌడ్ కోరారు. గురువారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. మండల కేంద్రంలో ఈ నెల 23న నిర్వహించే కార్యక్రమానికి ప్రజలు తరలి రావాలన్నారు. సమావేశంలో నాగలింగం, గోపి, వీరన్న, సోమయ్య, రమేష్, సురేష్, శేఖర్ తదితరులు ఉన్నారు.

సీపీఎం నాయకుడి మృతి

హుజూర్‌నగర్, జూన్ 20: మండలంలోని గోపాలపురం గ్రామంలో సీపీఎం నాయకుడు వార్డు మాజీ మెంబర్ గరిడేపల్లి వెంకన్న బుధవారం అనారోగ్యంతో మృతి చెందాడు.ఆయన మృతదేహానికి మాజీ సర్పంచ్ శాసనాల నాగసైదయ్య, ఎంపీటీసీ రాజారావు, న్యాయవాది కాల్వ శ్రీనివాసరావు, కాంగ్రెస్, సీపీఎం బీజేపీ టీడీపీ, బీఆర్ఎస్ నాయకులు గురువారం నివాళులర్పించారు.